విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 04 మార్చి 2025 8 పేజీలు

అలవాటు పడితే... ఆగమే!

- సమూహంలో గుర్తింపు కోసం పెడదారులు
- ఎంజాయ్ మోజులో రొంపిలోకి
- జీవితాలను నాశనం చేసుకుంటున్న విద్యార్థులు

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: ప్రస్తుతం ఆధునికత వైపు రోజు.. రోజుకు క్షీణిస్తున్న విలువలు. మరోవైపు..యువత పెడదారులు పెట్టేందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. పాఠశాలల స్థాయి నుంచి విద్యార్థుల పైకి వ్యసనాల వల విసురుతున్నారు. పదవ తరగతి దాటకముందే మత్తుకు బానిసలుగా అవుతుండగా ఎక్కువ మంది ఇంటర్ నుండి డిగ్రీ,ఇంజనీరింగ్ దశలో సిగరెట్లు, మద్యం వ్యసనాల బారిన పడుతున్నారు. చెడు స్నేహాలతో ఎంజాయ్ మోజులో ఒకసారి రొంపిలోకి దిగిన వారు తిరిగి బయటకు రాలేకపోతున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపానికి తోడు డబ్బు ఉండడంతో యువత మత్తుకు చిత్తయిపోతున్నారు. పిల్లల ప్రవర్తనను ఎల్లప్పుడూ కనిపెడుతూనే ఉండాలి. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఇక వారి జీవితం నాశనం అయినట్లే తస్మాత్ జాగ్రత్త అని వైద్యులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ మంది ఇంటర్ దాటగానే మత్తు ప్రభావాలకు లోనవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. 16 నుంచి 20 ఏళ్ల వయసు పిల్లలకు గుర్తింపు ఎక్కువగా ఉంటుంది. అందుకోసం అనవసర సావాసాలు చేయడానికి సిద్ధపడతారు. సీరియల్స్‌ను ఫాలో అవుతూ తాము హీరోలమని పించుకోవడానికి సిద్ధపడుతూ ఉంటారు. తమ అభిమాన హీరో స్టైల్ లో సిగరెట్ తాగి వారిని అనుకరిస్తూ పొంగిపోతుంటారు. సిగరెట్‌తో మొదలైన వారి సాహస యాత్ర మద్యం, గంజాయి, డ్రగ్స్ వరకు కొనసాగుతుంది. సంపన్న వర్గాలకు చెందిన విద్యార్థులు తమ ఆధిపత్యాన్ని నిరూపించుకునేందుకు ▶మిగతా 2లో..

పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా

విశాలాంధ్ర - కాకినాడ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా మార్చి 3న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన చేయాలని పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బొబ్బిలి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం కాకినాడ కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా ▶మిగతా 2లో..

ఆటో కార్మికులకు

వాహన మిత్ర ఇవ్వాలి

- ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఏపీ ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్

విశాలాంధ్ర- రాజమండ్రి : ఆటో డ్రైవర్స్, మోటార్ కార్మికులకు ప్రభుత్వం వాహన మిత్ర వెంటనే రూ.15000 ఇవ్వాలని జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబల్ల ▶మిగతా 2లో..

మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -భీమవరం: మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లింపు, పనులు అప్పగింత, నిర్వహణ, సాంఘిక భద్రత, పురపాలక శాఖకే పూర్తి బాధ్యతలు అప్పగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమ సుందర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోని మున్సిపల్ వర్కర్స్ ఎఐటియుసి అధ్వర్యంలో పెద్ద ఎత్తున సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పర్మినెంట్, కాంట్రాక్ట్, అప్కోస్ పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని,

కనీస వేతనం రూ. 35 వేలు ఇవ్వాలని, పిఆర్సీని వెంటనే అమలు చేయాలని, మూడేళ్లుగా పెండింగులో ఉన్న డిఏ ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో కొత్త వారిని నియమించి పని భారం తగ్గించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలని, స్కూల్ స్వీపర్లకు వేతనాలు పెంచాలని వేతనాలు పెంచాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులు రిటైర్డుమెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎఐటియుసి పట్టణ పట్టణ అధ్యక్షులు, చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ రిటైరయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలివ్వాలని, పెండింగులో ఉన్న బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపుపై నాటి సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన అగ్రిమెంట్ అమలు చేయాలని చెల్లబోయిన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.వి.ఆనంద్, వాసు, డి.శ్రీను, కళింగ లక్ష్మణరావు, తలారి లక్ష్మీనారాయణ, మామిడిశెట్టి లక్ష్మీపతి, ఎఐసిటియు పట్టణ అధ్యక్షుడు కె.మహంకాళి, కొల్లాబత్తుల యోహాను, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద కొల్లేరు వాసుల ధర్నా

విశాలాంధ్ర-పెదవేగి: పెదవేగి మండలం కొండలరావు పాలెం గ్రామంలో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది.తమకు వైసిపి మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నుంచి రావలసిన బకాయిలు చెల్లించాలంటూ గత రెండు నెలలకు పైగా కొల్లేరుకు చెందిన లంక గ్రామాల ప్రజలు నిరవధికంగా కొండలరావు పాలెంలోని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఇంటి వద్ద ధర్నా కొనసాగిస్తున్నారు. లంక గ్రామాల ప్రజలకు ఎటువంటి సమాధానం చెప్పకుండా అబ్బాయి చౌదరి వర్గం తప్పించుకుని తిరుగుతున్నారు. లంక గ్రామాల ప్రజలు దాదాపు 2నెలల పైగా నిరవధికంగా ఇంటి వద్ద ధర్నా కొనసాగిస్తుండగా సోమవారం ఉదయం అబ్బయ్య చౌదరికి చెందిన పామాయిల్ తోటలోని గెలలు నరికే నెపంతో కొంతమంది కూలీలను తీసుకుని వైసిపి నాయకులు కార్యకర్తలు కొండలరావు పాలెంలో గ్రామానికి చేరుకుని అబ్బాయి చౌదరి ఇంటి వద్ద ధర్నా చేస్తున్న లంక గ్రామాల ప్రజలపై దాడికి దిగారు. దీంతో ▶మిగతా 2లో

నేటి నుంచి ప్రభుత్వాసుపత్రి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

విశాలాంధ్ర -తణుకు: తణుకు జిల్లా ప్రభుత్వాసుపత్రి కాంటాక్ట్ పారిశుధ్య కార్మికులు సుధీర్ఘ కాలంగా పరిష్కారానికి నోచుకోని న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 4 వ తేదీ నుంచి విధులు బహిష్కరణకు

పూనుకుంటున్నట్టు ఏపీ మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల ▶మిగతా 4లో

స్నేహాంజలి క్రికెట్ టోర్నీ విజేత ఎం.కింగ్స్

విశాలాంధ్ర-లింగపాలెం: స్నేహాంజలి క్రికెట్ టోర్నీ-12 ముగిసింది. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన ఈ టోర్నీలో పాల్గొన్న జెర్సీటీం క్రికెటర్లకు ధర్మాజీ గూడెంకు చెందిన మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ జెర్సీలను అందజేశారు.ఈ టోర్నమెంట్లో కొత్తపేటకు చెందిన ఏ.ఎం కింగ్ విన్నర్ గా నిలిచింది.విన్నర్ గా నిలిచిన ఈ టీంకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి రూ.20 వేల నగదును బహుకరించారు.జెర్సీ టీము విన్నర్‌గా నిలిచింది.

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు మొదలు

విశాలాంధ్ర-లింగపాలెం: ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. ధర్మాజీగూడెంలోని రెండు పరీక్ష కేంద్రాలలో 251 మంది విద్యార్థులు పరీక్షలో రాయల్సి ఉండగా 236మంది పరీక్షలకు హాజరయ్యారు. 15 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. ధర్మాజీగూడెం ఎమ్మెన్నార్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 111 మంది పరీక్ష రాయగా, ఉన్నత పాఠశాల కేంద్రంలో 125 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ అధికారి జె. వెంకటేశ్వరరావు విధులు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

సాయిపల్లవికి జాతీయస్థాయి అవార్డు

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి ఇండోసాక్సన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన మూడవ తరగతి విద్యార్థిని కాగిత సాయి పల్లవి స్పెల్ బి పోటీల్లో జాతీయస్థాయి అవార్డును అందుకుంది.

హైదరాబాదులో విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించిన జాతీయస్థాయి స్పెల్ బి పోటీలో ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన కాగిత సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుసుమల కుమార్తె కాగిత సాయి పల్లవి ప్రతిభను కనబరిచి రైజింగ్ స్టార్ కైవసం చేసుకుంది. పాఠశాల, జిల్లా, రాష్ట్రస్థాయిలో టాపరుగా నిలిచి జాతీయస్థాయి పోటీలో నిలిచి వివిధ రాష్ట్రాల విద్యార్థులతో పోటీపడి అవార్డును పొందింది. ఈమెను పాఠశాల ప్రిన్సిపాల్ సాలిజార్జ్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర-టి నరసాపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని టి నరసాపురం ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎం.లక్ష్మీ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వారం షెడ్యూల్ లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలతో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మార్చి 1నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కలిగి వుండాలని అన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు.గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఝాన్సీ, పద్మ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్నా (1వ పేజీ తరువాయి)

సమాచారం అందుకున్న స్థానిక టిడిపి నాయకులు లంక గ్రామాల ప్రజలకు అండగా నిలబడటానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి తెలుగుదేశం పార్టీ నాయకులకు సర్దిచెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇప్పటికైనా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి లంక గ్రామాల ప్రజలకు చెల్లించాల్సిన సుమారు తొమ్మిది కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే చెల్లించాలని, దాడులు చేయడం వంటివి చేస్తే చూస్తూ ఊరుకోమని టిడిపి నాయకులు తెలిపారు.

సురేష్‌పై వైసీపీ నాయకుల దాడి

కొండలరావు పాలెం వద్ద తమపై వైసీపీ నాయకులు దాడి చేశారని టిడిపి నేత అన్నపనేని సురేష్ తెలిపారు.వైసీపీకి చెందిన పలువురు నాయకులు దాడి చేసి గాయపరిచారని ఈ నేపథ్యంలో ఏలూరులోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సురేష్ మీడియాకు వివరించారు.

వాహనమిత్ర ఇవ్వాలి

(1వ పేజీ తరువాయి)

సూర్యారావు భవన్లో ఆటో డ్రైవర్స్, ఓనర్స్ డ్రైవర్స్ సర్వసభ్య సమావేశం పి.రామచంద్ర రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర 15 వేల రూపాయలు ఇస్తామని భారీగా జరిమానాలు పెంచే జీవో నెంబర్ 21, 31 రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, డీజిల్, పెట్రోల్ తగ్గిస్తామని చెప్పారని, ఇప్పటికి 9 నెలలు సమయం అవుతున్నా ఎన్నికల హామీలు నెరవేర్చలేదని మధు అన్నారు. ప్రైవేటు ఫైనాన్షియర్లు చేస్తున్న అధిక వడ్డీలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, శంకర్, సుబ్బయ్య, కిషోర్, శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

పర్మినెంట్ చేయాలి

(1వ పేజీ తరువాయి)

జరిగింది. ధర్నాకు ముఖ్య అతిథులుగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. కిర్లకృష్ణారావు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆప్కాసును రద్దు చేస్తామని, ప్రైవేటు బడావ్యక్తులకు, వారి ఏజెన్సీలకు పనులు అప్పగిస్తామని మంత్రి వర్గ సభ్యులు పత్రికలలో ప్రకటించడంతో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో దశలవారి పోరాటాలకు పిలుపునిచ్చిందని అన్నారు. ఆప్కాసును రద్దు చేస్తే మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లింపు, పనులు అప్పగింత మున్సిపల్ శాఖకే బాధ్యతలు అప్పగించాలని, బడా వ్యక్తులకు వారు ఏజెన్సీలకు అప్పగించొద్దని, ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రోజు రోజుకి పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం కనీస వేతనాలు 35 వేల రూపాయలు మంజూరు చేయాలని, గత మూడు సంవత్సరాలుగా పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు ఎన్కాస్మెంట్, మూడు డిఏలు తక్షణమే చెల్లించాలని, జనాభా ప్రాతిపదికన సిబ్బందిని పెంచాలని, ఏడాది కాలంగా పెండింగ్లో ఉన్న మరణించిన లేదా రిటైర్మెంట్ అయినా వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగ కార్మికులు వల్లే ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికుల వయసు 62 సంవత్సరాల కు పెంచాలని ఆయన అన్నారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ, సామర్లకోట, పిఠాపురం ప్రాంతాల్లో పనిచేయుచున్న పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు డబ్బాలు, చీపుర్లు, పారలు, గునపాలు కొరత తీర్చాలని, కాకినాడ స్పెషల్ సానిటేషన్, టాయిలెట్ కార్మికుల 5 నెలల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని, పిఠాపురం శాసనసభ్యులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గం పురపాలక సంఘంలో టాయిలెట్ మల విసర్జనలు శుభ్రం చేసే కార్మికులకు కేవలం 4000 రూపాయలు మాత్రమే జీతాలు మంజూరు చేస్తున్నారని వారి జీతాలు తక్షణమే పెంచాలని ఆయన అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే మార్చి 11 తేదీన చలో విజయవాడకు సిద్ధమవుతామని ఆయన అన్నారు. ధర్నా అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, బంగారు రాజేషు, బొబ్బిలి ఈశ్వరరావు, బొబ్బిలి సత్యనారాయణ, ఎల్లారావ్, బొత్స శ్రీను, దోకుమూరు సురేష్, బంగారు అప్పారావు, కన్నా, సురేష్, అర్జున్ రావు, సింగంపల్లి అప్పారావు, తదితరులు కాకినాడ, పిఠాపురం, సామర్లకోట, గొల్లప్రోలు ప్రాంతాల నుండి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగమే (1వ పేజీ తరువాయి)

డబ్బును మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేస్తారు. బార్లు,బీర్లు ఏది కావాలంటే అది తెప్పిస్తూ మిగతావారు తమను అంటిపెట్టుకొని ఉండేటట్టు చూసుకుంటారు. దీంతో అతని కోసం మిత్రులు ఎలాంటి అఘాయిత్యానికైనా ఒడిగట్టేందుకు సిద్ధపడతారు.

పతనం అంచున నిలబడి తల్లిదండ్రులు ఇతర పెద్దల మాటలు పెడచెవిని పెడతారని మానసిక వైద్యులు చెబుతున్నారు. చీకటి పడితే చాలు ముఖ్యంగా యువత సిగరెట్లు,మద్యానికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.మద్యం సీసాలు కూడా ఎక్కడపడితే అక్కడ వేస్తూ జడలు విప్పుతున్న మత్తు మహమ్మారి కారణంగా అనేక సంఘటనలకు కారణం అవుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ యువత ఎంతోమంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. దీనిపై పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ పోలీసుల మాటలు పెడచెగిన పెడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఆధునికత సాంకేతిక పరిజ్ఞానం మంచికి ఎంత ఉపయోగపడుతుందో.. చెడుకు కూడా అంతే ఉపయోగపడుతుంది.యువత అశ్లీల వీడియోల నుంచి సైకోటిక్ వీడియోలు వీక్షించడం ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు గమనించాల్సి ఉంటుందని మానసిక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు ఇంట్లో తీసుకునే డబ్బుకు ఖచ్చితంగా లెక్కలు అడగాలి..తరచూ సాధారణం కంటే ఎక్కువ డబ్బులు అడుగుతుంటే అప్రమత్తమై ఆరా తీయాలి. ఇంటికి దూరంగా ప్రైవేటు గదిలో వసతి గృహాలలో ఉండే వారిని ఆకస్మికంగా సందర్శిస్తూ పరిస్థితిని గమనిస్తూ ఉండాలి. ఇంటికి తరచూ ఆలస్యంగా వస్తున్నప్పుడు ఎలాంటి స్థితిలో ఉన్నాడో గమనించాలి. అనవసరంగా అరవడం లాంటి విపరీత ధోరణి వ్యక్తం చేస్తుంటే సెల్ ఫోన్ లో వాట్సప్,ఇన్స్టాగ్రామ్ లాంటి యాప్ లను తనిఖీ చేయాలి. యుక్త వయసులో చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఎంతైనా ఉంది.

ఉపాధి పనుల సామాజిక తనిఖీలు పూర్తి

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024మార్చి నెలాఖరు వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన సామాజిక తనిఖీలు ముగిశాయి.

రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ నందిని ఆధ్వర్యంలో ఐదుగురు డిఆర్పీలు, 8 మంది తనిఖీల బృందం సభ్యులు గ్రామాల వారీగా తనిఖీలు చేశారు. 2023 నుంచి2024 సంవత్సర కాలంలో 21కోట్ల65లక్షల75 వేల రూపాయల విలువ గల పనులు జరిగాయి. వీటితో1633 పనులు చేశారు.వీటిలో ఉపాధి కూలీలు చేసిన పనులు1601కాగా వీటికి రూ.18.26 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి పథకంలో పంచాయతీరాజ్ కు సంబంధించి 7 పర్కులు చేశారు. వీటికి దాదాపు రూ.2.86కోట్లు ఖర్చు చేశారు. సర్వశిక్ష అభియాన్లో పాఠశాలల్లో సౌకర్యాలు కోసం 7వర్కులు చేశారు. వీటి కోసం దాదాపు రూ34.51లక్షలు ఖర్చు చేశారు.ప్రతి ఏడాది జరిగే ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు జరుగుతుంటాయి. తనిఖీలు పూర్తయిన తర్వాత మండల కేంద్రంలో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు ఉండటంవల్ల మండల స్థాయిలో కాకుండా జిల్లా కేంద్రంలోని డ్వామా కార్యాలయంలో మంగళవారం సభ నిర్వహిస్తున్నారు. తనిఖీలకు సంబంధించి పూర్తి వివరాలు జిల్లా కార్యాలయంలో జరిగే సమావేశంలో నివేదిక సమర్పిస్తారు. ప్రాథమిక సమాచారాన్ని బట్టి మండలంలో జరిగిన పనులలో రూ15 లక్షలు మేర అవక తవకలు జరిగినట్లు తెలుస్తుంది.దీనికి సంబంధించి పూర్తి వివరాలు తనిఖీలు నిర్వహించిన బృందం సభ్యులు తమ నివేదికను జిల్లా అధికారులకు వెల్లడిస్తారు.

ఇంటర్ పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు

విశాలాంధ్ర - గణపవరం: ప్రశాంతంగా ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు జరిగినట్లు గణపవరం శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షల చీఫ్ సూపరింటెండెంటు ఎం.రఘు తెలిపారు. సోమవారం సెకండ్ ఇయర్ తెలుగు పరీక్షకు 42 మంది విద్యార్థులకు గాను 40 మంది పరీక్షలు రాశారని ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. హిందీ 15 మందికి 15 మంది హాజరయ్యారన్నారు. సంస్కృత్ 122 మంది విద్యార్థులకు 118 మంది హాజరైనట్లు నలుగురు గైరాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ 18 మంది విద్యార్థులు గాను 18 మంది పరీక్షలు వ్రాసేరని తెలిపారు. మొత్తం 197 మందికి 191 మంది పరీక్షలు వ్రాసేరని 6 మంది గైరాజరైనట్లు ఆయన తెలిపారు.పరీక్షలు వ్రాసే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని రఘు తెలిపారు.

గణపవరం ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిగా కిరణ్మయి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలో పూర్తి బాధ్యతలతో వైద్యాధికారిగా డాక్టర్ పల్లికొండ కిరణ్మయి సోమవారం మెడికల్ డ్రాయింగ్ అండ్ డెస్బర్ సింగ్ (డిడిఓ) ఆఫీసర్‌గా పీహెచ్ సీలో డాక్టర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ



ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారు సూచన సలహాలు మేరకు ఎప్పటికప్పుడు ఇచ్చిన టార్గెట్లను పూర్తి చేస్తారని డాక్టర్ తెలిపారు. ఇప్పటివరకు డాక్టర్ గా పనిచేసిన టి హెచ్ ఆర్ ఎస్ సంతోష్ నాయుడు గత నాలుగు సంవత్సరాల ఐదు మాసాలు వైద్యాధికారిగా పనిచేసి ఆయన పై చదువులకు ఉన్నత విద్య నిమిత్తం ప్రభుత్వ కోటాలో రాజమహేంద్రవరంలో జాయిన్ అయినట్లు కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి పద్మజ, పి.నీరజ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

విశాలాంధ్ర -జంగారెడ్డిగూడెం : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి దశల వారి ఆందోళనలో భాగంగా సోమవారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున మూడో తేదీ కలెక్టరేట్ వద్ద జరగవలసిన ధర్నా ఆరో తేదీన విజయవాడలో జరగవలసిన ధర్నా వాయిదా పడినట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య విభాగం సెక్రటరీ బొక్క శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు కంతేటి వెంకటరావు, సెక్రటరీ నిమ్మల సుబ్బారావు, దోసూరి నాగరాజు, అయినాల ముత్యాలరావు, అప్పలస్వామి, బాలు కొత్తూరి నాగేశ్వరరావు, ఏమిలేశ్వరరావు, కొత్తూరి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

పీఎం-శ్రీ యోజన పనుల పరిశీలన

విశాలాంధ్ర -మండవల్లి : సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కురేళ్ళ పంకజ్ కుమార్ మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీఎం-శ్రీ యోజన పథకం పనులను పరిశీలించి,పనులు త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా ఆదేశిస్తూ పాఠశాల స్థితిని చూసి ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.జి. ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను పరిశీలించి అందులో ఉన్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జి.సత్యనారాయణ మాస్టర్, జ్యోత్స్న,సి.ఆర్.ఎం.టి స్మారక కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరరావుకు నివాళి

విశాలాంధ్ర-కామవరపుకోట: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ దివంగత కళాకారుడు మావూరి ఉత్తరరావుకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు ఘన నివాళులర్పించారు ఉత్తర్ రావు చిత్ర కళాకారులుగా కుంచె చేతపట్టి ఆయన చేతుల మీదుగా ఎందరో మహానుభావుల రూపాలను చిత్రించారని, చిత్ర కళాకారునిగానే కాకుండా రంగస్థలం దర్శకుడుగా కళాకారునిగా ఎంతోమంది యువ కళాకారులను తీర్చిదిద్దిన ఆయన వర్ధంతి సందర్భంగా సీనియర్ బుర్రకథ కళాకారుడు ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షులు సబ్బ కనకారావు జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్లారీ కృష్ణ బాబు ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ తదితరులు గారికి ఘన నివాళులర్పించారు.

జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్ కేసులు ఎక్కువగా రాజీ చేసుకోవడానికి కృషి చేయాలని ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మి నారాయణ అన్నారు.

ఫోక్సో కోర్టు హాలులో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసులు రాజీకి కక్షిదారులకు అవగాహన కల్పించాలని రాజీ చేసేందుకు ఎటువంటి చట్టపరమైన సమస్యలు వచ్చినా న్యాయమూర్తుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాజీ చేయుటకు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని, దూరంగా ఉన్న కక్షిదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ జి.సురేష్ బాబు, రెండవ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి.ధనరాజు, భీమవరం డిఎస్పీ ఆర్.జి.జయ సూర్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలి

నిరాహార దీక్షను కొనసాగిస్తున్న పశువైద్య విద్యార్థులు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్ర రాష్ట్రంలో పశు వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అందరూ గత పది రోజుల నుంచి నిరాహార దీక్ష వారి కళాశాలల్లో చేపడుతున్నారు. రాష్ట్రంలో నాలుగు కళాశాలలు ఉన్నాయి. అవి కృష్ణాజిల్లా గన్నవరం, తిరుపతి, కడప జిల్లా ప్రొద్దుటూరు మరియు విజయనగరం. ఒక్కొక్క కళాశాలలో 400 పై చిలుకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులకు ప్రతినెల స్టైఫండ్ 2013 వరకు 5000 ఇచ్చేవారు. 2013 సంవత్సరంలో 5000 స్టైఫండ్ సరిపోవట్లేదని విద్యార్థులు అందరూ ఐక్యంగా పోరాటం కొనసాగిస్తున్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 7000 ఇస్తామని హామీ ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు కూడా 7000 తోనే కొనసాగిస్తున్నారు. మిగతా ఎంబిబిఎస్ , ఆయుష్ , బిడిఎస్ వారికి మాత్రం 25,000 స్టైఫండ్ ఇస్తున్నారు. మూగ జంతువులకు ట్రీట్మెంట్ చేస్తున్నాము కదా మాకు మాత్రం ఎందుకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వరని విద్యార్థులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పశువైద్య విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజును 35,000

నుంచి 50 వేలకు పెంచారు కానీ స్టైఫండ్స్ మాత్రం పెంచకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్టైఫండ్ పెంచాలని విద్యార్థి, యువజన, రైతు, సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రైతు సంఘం నాయకులు లక్ష్మణ్ రావు, ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్, ఏఐఎస్ఎఫ్ కోశాధికారి యం. క్రాంతి కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సునీల్ అనిల్, రవి పాల్గొన్నారు.

యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా మార్చండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఎంపీ యూపీ పాఠశాలను హైస్కూల్‌గా మార్చకపోతే గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను తరగతులు జరగకుండా నిలిపివేస్తాం అని దిప్పకాయలపాడు గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో దిప్పకాయలపాడు గ్రామంలో ఎంపీ యూపీ పాఠశాల ఎదురుగా రాష్ట్ర రహదారిపై కూర్చొని ధర్నా నిర్వహించారు. దిప్పకాయలపాడు గ్రామంలో ఉన్న ఎంపియుపి పాఠశాలను ప్రైమరీ పాఠశాలగా చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని, గ్రామంలో ఉన్న ఎంపీ యూపీ పాఠశాలలో అదనపు తరగతి గదులు కూడా ఉన్నాయని పదవ తరగతి వరకు ఇక్కడే తరగతులు నిర్వహించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. తమ గ్రామం నుండి పదవ తరగతి విద్యను అభ్యసించాలంటే ఎటు చూసినా మూడు

కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని, ఆడపిల్లలు బాగా ఇబ్బంది పడుతున్నారని, ప్రతిరోజు ప్రయాణం చేయాలంటే పలు అవరోధాలను కూడా ఎదుర్కొంటున్నారని, సంబంధిత అధికారులు స్పందించి యూపీ స్కూల్ ను హైస్కూల్ గా చేయాలని రైతు సంఘం నాయకులు కాకర్ల నందియా తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభయ రక్షణ దళం ఆధ్వర్యంలో అవగాహన

విశాలాంధ్ర-ఏలూరు: మహిళలు, బాలికలు, వృద్ధుల రక్షణ కోసం అభయ రక్షక దళం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది.

అభయ రక్షక దళ సభ్యులు గస్తీ నిర్వహిస్తూ, సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, ఇతర భద్రతా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అభయ వాహనం ద్వారా సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళా భద్రత, ఆత్మ రక్షణ పద్ధతులపై దృశ్య రూపక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మహిళలు, బాలికలు భద్రతా సమాచారం పొంది,అజాగ్రత్తగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం, సమాజంలో మహిళలపై నేరాలు తగ్గించ దం, భద్రతా చైతన్యం పెంపొందించడం. అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలన కొరకు అత్యవసర సమయాలలో బాలికలు, మహిళలు, వృద్ధులు సంరక్ష ణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన టోల్ ఫ్రీ నెంబర్‌ను గురించి అవగాహన నిర్వహించారు. జిల్లాలో ఉన్న అన్ని జడ్పీ హైస్కూల్స్, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో అభయ పెట్రోలింగ్, స్కూలును బిసి వెల్ఫేర్ హాస్టల్లో ఓపెనింగ్ ప్రదేశాల్లో తిరిగి మహిళల సంరక్షణకు ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ప్రజలకు, విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు.

మానవరహిత వాహనాల తయారీపై విస్తృత పరిశోధనలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: మానవ రహిత వాహనాల తయారీపై ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ఐఐటి హైదరాబాద్-టీహాన్ డైరెక్టర్ డాక్టర్ పి.రాజ్యలక్ష్మి తెలిపారు. ఏపీ నిట్‌లోని ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్

ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో అన్మేన్డ్ ఏరియల్ వెహికల్స్ ఫర్ వైర్ లెస్ కమ్యూనికేషన్ అండ్ రిమోట్ సెన్సింగ్ అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించనున్న స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ భానావతు నర్సింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ రాజ్యలక్ష్మి ఆన్ లైన్ ద్వారా మాట్లాడుతూ మానవరహిత వాహనాల్లో డ్రోన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని వివరించారు. గౌరవ అతిథి ఐఐటి హైదరాబాద్ ఆచార్యులు డాక్టర్ జీవీవీ. శర్మ మాట్లాడుతూ కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డ్రోన్ టెక్నాలజీ వినియోగం రోజురోజుకు పెరుగుతుందని చెప్పారు. రిమోట్ కంట్రోల్ సహాయంతో పనిచేసే సమర్థవంతమైన డ్రోన్లు అందుబాటులోకి వస్తున్నాయని వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి మాట్లాడుతూ నిఘా నేత్రాలుగా డ్రోన్లు అద్భుత పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మనుషులు వెళ్లలేని కొండలు, పర్వతాలు వంటి ప్రాంతాలకు సైతం డ్రోన్లు సులువుగా వెళ్లగలుగుతున్నాయని తెలిపారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు డాక్టర్ గుర్రాల కిరణ్ కుమార్, డాక్టర్ కార్తికేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో సూర్య ట్రేడర్స్ ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : పిఒపి సీలింగ్ మెటీరియల్స్ లో గత 20 సంవత్సరాలుగా నల్లజర్ల పట్టణంలో దిన దినాభివృద్ధితో వ్యాపార రంగంలో రాణిస్తూ, తాడేపల్లిగూడెం పట్టణంలో నూతనంగా సోమవారం నుండి గృహ అలంకరణకు ఉపయోగపడే సీలింగ్ మెటీరియల్స్, జిప్సం, బోర్డు చానల్స్, పిఒపి షీట్లు, జిప్సం షీట్లు,మరియు పివిసి షీట్లు నాణ్యత కలిగిన

సామాగ్రిని, హోల్‌సేల్ ధరలకే లభిస్తాయని తెలిపారు. కొనుగోలుదారుని అవసరతను బట్టి మ్యాన్ పవర్ కూడా అందించబడుతుందని సూర్య ట్రేడర్స్ యజమానులు అచ్యుత నరసింహమూర్తి, కంభాల గణేష్ తెలిపారు.

అంగన్వాడీలు కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర-కామవరపుకోట: మండలంలోని అంగన్వాడీల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సౌతాన సెంటర్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారుల

ఉత్తర్వుల మేరకు హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకరమైన మహిళలు -సంతోషకరమైన మహిళలు అనే కార్యక్రమం పై అవగాహన కల్పించామన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: ఎం ఎస్ ఎం ఈ సర్వే త్వరగా పూర్తి చేసేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారులు అధికారులకు సహకరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఎం ఎస్ ఎం ఈ సర్వేలో భాగంగా 20వ వార్డు

మసీదు రోడ్డులోని గ్యాస్ ట్రేడింగ్, కిరాణా జనరల్, టైలరింగ్ షాపులను సంబంధిత శాఖల అధికారులతో కలిసి సందర్శించి ఎంఎస్ఎంఈ నమోదుపై ఆరా తీశారు. ఎం ఎస్ ఎం ఈ సర్వే త్వరగా పూర్తి చేసేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారస్తులు సిబ్బందికి సహకరించాలని జాయింట్ కలెక్టర్ కోరారు. ఏపీ ఎం ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది నిర్వహిస్తున్న ఎం ఎస్ ఎం ఈ సర్వేకు జిల్లాలోని అందరూ చిన్న, మధ్య తరహా వ్యాపారస్తులు తమ వద్ద ఉన్న పాన్ కార్డు, ఆధార్ కార్డు, జీఎస్టి, పవర్ బిల్లుతో ఎం ఎస్ ఎం ఈ సర్వే నమోదు చేయుటకు వచ్చిన గ్రామ వార్డు సచివాలయం సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలు అందించి సర్వే త్వరగా పూర్తి అయ్యేటట్లు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. సంబంధిత శాఖల అధికారులు సర్వే త్వరగా పూర్తి అయ్యేటట్లు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, ఐ పీ ఓ జె వి సి శ్రీపతిరావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

8న భారీగా మహిళా దినోత్సవ ర్యాలీ

ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం: మార్చి 8న మహిళా దినోత్సవంలో భాగంగా భారీగా ర్యాలీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా దినోత్సవ ర్యాలీ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్లో వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

మాట్లాడుతూ మహిళ పండుగగా పేర్కొనే మహిళా దినోత్సవం రోజున ప్రభుత్వ శాఖలు,స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రకాశం చౌక్ నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు సుమారు వెయ్యి మంది వివిధ వర్గాల మహిళలు, విద్యార్థినులతో భారీ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థినులచే ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుకు సన్నాహక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ ర్యాలీలో ఐసిడిఎస్, డిఆర్డిఏ,మెప్మా, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖల మహిళ సిబ్బంది,వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థినులు మహిళా దినోత్సవ ర్యాలీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి బి.సుజాత రాణి, డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డిఎంహెచ్వో బి.భాను నాయక్, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఐసిడిఎస్ నోడల్ అధికారి విజయలక్ష్మి, లైన్స్ ఇంటర్నేషనల్ సిహెచ్ కృష్ణంరాజు, వెస్ట్ బెర్రీ డైరెక్టర్ ఎన్.మహేష్ వర్మ, ప్రముఖ సంఘ సేవకులు కంతేటి వెంకటరాజు, మెప్మా,వ్యవసాయ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -తణుకు: పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ తక్షణమే అమలు జరిపి పేదల సొంత ఇంటికల నెరవేర్చాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు.

సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం తణుకు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఇళ్ళ స్థలాల వ్యక్తిగత అర్జీలు డిప్యూటీ తహసీల్దార్కు అంద జేశారు. ధర్నా

నుద్దేశించి భీమారావు మాట్లాడుతూ పేదలు సొంత గృహాలు లేక అద్దె ఇళ్ళకు నెలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయలు అద్దెలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. పేదలు అద్దె ఇళ్ళల్లో కాకుండా సొంత ఇళ్ళలో వుండే పరిస్థితి కల్పిస్తే ప్రతీ పేద కుటుంబానికి నెలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయలు వరకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. తక్షణమే పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన పేదల ఇళ్ళ స్థలాలు హామీ అమలయ్యేవరకు ఉద్యమిస్తామన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ,ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి,రాష్ట్ర సమితి సభ్యురాలు వై. నాగలక్ష్మి, సీపీఐ నాయకులు నామాన వెంకటేశ్వరరావు, ఎన్. రామశ్రీను, జక్కంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు మెరుగైన సేవలు అందించాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: రేషన్ లబ్ధిదారులకు మెరుగైన సేవలను అంద జేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం మండలం చినమిరం గ్రామంలో 62 నెంబరు రేషను షాపును జాయింటు కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు.

షాపులో ఉన్న సరుకులు ప్రకారం స్టాకు రిజిస్టరును, కార్డు దారులకు పంపిణీ చేసే రికార్డులను పరిశీలించారు. ఎండియు వాహనముపై సరుకులు వివరాలు రేట్లు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు కార్డుదారుల ఇళ్ల వద్దకు వెళ్ళి మాట్లాడారు. పంపిణీ తీరుపై ఆరా తీసి, ఏఏ సరుకులు ఎంత మేర ఇస్తున్నారు కార్డులో ఎంతమంది సభ్యులు ఉన్నారు ప్రతి నెల క్రమం తప్పకుండా రేషన్ సరుకులు తీసుకుంటున్నారా అడిగి తెలుసుకున్నారు. ఇచ్చే ధరలు, పంపిణీపై కార్డు దారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. షాపులో ఉన్న స్టాకు పంపిణీ చేసిన సరుకులు వివరములు రికార్డును ప్రకారం ఖచ్చితంగా ఉండాలన్నారు. నిరుపేద ప్రజలకు అందించే నిత్యవసర సరుకులు ఏటువంటి

పొరపాట్లు జరగకూడదన్నారు. క్రమం తప్పకుండా రేషన్ షాపులు, ఎండియు వాహనం సరుకులు పంపిణీపై పర్యవేక్షణ చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంలో సివిల్ సప్లై రెవిన్యూ ఇన్స్పెక్టరు ఎ.సురేష్, వీఆర్వో శ్రీనివాసు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర-ఏలూరు: సి ఆర్ ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రోడ్డుప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలనే సందేశాన్ని ప్లే కార్డుల ప్రదర్శన ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమం ఉదయం గం. 10లకు స్కూలు ప్రాంగణంలో ప్రారంభమైంది. హెల్మెట్ ప్రాణాలను కాపాడే కవచం! మీ కుటుంబాని కోసం హెల్మెట్ ధరించండి! సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్ తప్పనిసరి! ప్రమాదాలను తగ్గించేందుకు హెల్మెట్ ఉపయోగించండి! అనే ప్ల

కార్డులతో విద్యార్థులు తల్లిదండ్రులు,ద్విచక్ర వాహనదారులను హెల్మెట్ ఉపయోగంపై చైతన్యం కల్పించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు.ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు హెల్మెట్ ఉపయోగం వల్ల గాయాల తీవ్రత తగ్గుతుందని, రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించుకోవచ్చని వివరించారు.

కార్మికుల సమ్మె

(1వ పేజీ తరువాయి)

భీమారావు అన్నారు. సోమవారం తణుకు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వద్ద కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లడుతూ గత 5 నెలలుగా కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. 29 నెలలుగా పి.ఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమ చేయుట లేదన్నారు. తణుకు ఏరియా హాస్పిటల్ గా వున్న సమయంలో 1999 కు ముందు నియమించిన 19 మంది పారిశుధ్య కార్మికులతోనే పనులు చేయిస్తున్నారన్నారు. ఏరియా హాస్పిటల్ స్థానే జిల్లా హాస్పిటల్ గా అప్గ్రేడ్ చేసి 150 పడకలకు విస్తరించి నప్పటికీ అందుకనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించకపోవడం శోచనీయమన్నారు. పెరిగిన హాస్పిటల్ భవనాలు 150 పడకల జిల్లా హాస్పిటల్ స్థాయి కనుగుణంగా కనీసం మరో 50 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు విన్నవించుకున్నప్పటికీ ప్రయోజనం చేకూర లేదన్నారు. పనిభారంతో పారిశుధ్య కార్మికులు తీవ్ర ఒత్తిడికి గురై అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు మరో గత్యంతరం లేక ఈనెల 4 వ తేదీ మంగళవారం నుంచి విధులు బహిష్కరిస్తున్నట్టు భీమారావు చెప్పారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.పుష్పలత, ఎన్.వెంకటలక్ష్మి, పి. విజయలక్ష్మి, సిహెచ్ మంగమ్మ, ఎన్. లక్ష్మి, డి. ప్రసన్న, ఎం. బేబీ, చిన్నా తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు.

తొలి తెలుగు ఇంజనీరు వీరన్న సేవలు మరువలేం

విశాలాంధ్ర - గణపవరం: తొలి తెలుగు ఇంజనీరు వీణం వీరన్న చేసిన సేవలు మరువలేమని బిజెపి నాయకులు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు, రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్, రుద్రరాజు వేంకట సూర్యనారాయణ రాజు (ఆర్ వి ఎస్ రాజు) అన్నారు. సోమ వారం వీరన్న 231 జయంతి వేడుకలు పురస్కరించుకుని గణపవరం వంతెన డౌన్లో ఉన్న వీణం

వీరన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ వి ఎస్ మాట్లాడుతూ మద్రాసులో ఇంజనీరింగ్ లో శిక్షణ పొంది 1840లో రాజమండ్రి నీటిపారుదల శాఖలో ఉద్యోగంలో చేరాడు. కాటన్ దొర సహాయకుడిగా 1852 మార్చి 31 నాటికి పదివేల మంది శ్రామికులతో ఆనకట్ట పనులు పూర్తిచేశాడు. కాటన్ దొర స్వదస్తూరితో "వీణం వీరన్న నాకు లభించకపోతే ఇంతవేగంగా గోదావరి ఆనకట్టను పూర్తిచేయలేక పోయేవాణ్ని" అని రాసుకున్నాడు. వీరన్న సేవలకు గుర్తింపుగా బ్రిటిష్ ప్రభుత్వం రాయ్ బహదూర్ బిరుదు ప్రదానం చేసిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కె. రంగరాజు స్థానిక నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామోత్సవం

విశాలాంధ్ర-భీమడోలు: గ్రామదేవతలు శ్రీగంగానమ్మ, పోతురాజుబాబు, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల జాతర వేడుకలలో భాగంగా సోమవారం ఘనాచారులు గ్రామసంచారం కార్యక్రమం జరిగింది. ఈమేరకు ఘనాచారులు, అమ్మవార్ల ఘటాలతో మేళతాళాలు, మంగవాయిద్యాల నడుమ గ్రామంలోని సంతమార్కెట్, మిల్లువెనక తదితర ప్రాంతాల్లో గ్రామోత్సవం నిర్వహించగా గృహాల వద్దకు వచ్చిన వారికి మహిళలు మజ్జిగ సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వ్యాసరచనలో సీవీ రామన్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - అమలాపురం : శ్రీ సత్య సాయి సేవ ఆర్గనైజేషన్ ఎడ్యుకేషనల్ వింగ్ నిర్వహించినటువంటి వ్యాసరచన పోటీల్లో సర్ సివి రామన్ విద్యార్థులు పి పూజిత, వై చరిత, సిహెచ్ స్నేహశ్రీ పాఠశాల స్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవణ, వేణుగోపాల రావు విజేతలను అభినందించారు. భావ వ్యక్తీకరణను అభివృద్ధి చేయటంలో ఇలాంటి వ్యాసరచనలు ఎంతగానో ఉపయో గపడతాయని, విద్యార్థులు ఎప్పుడు తరగతి గది పాఠాలతో పాటు బాహ్య ప్రపంచం పోటీ పరీక్షల్లో కూడా పాల్గొని వారిలో ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నం చేసు కోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె పెద్దిరాజు పాల్గొన్నారు.

దివ్యాంగుల మధ్య జన్మదిన వేడుక

విశాలాంధ్ర-దేవరపల్లి : ప్రజా హెల్త్ ఫౌండేషన్ అధ్యక్షులు కడిమి రాజేష్ కుమార్ దేవరపల్లి మండలంలోని గొల్లగూడెం గ్రామంలో భారతి దివ్యంగుల సేవా సంస్థ నందు జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ప్రజా హెల్త్ ఫౌండేషన్ అధ్యక్షులు కడిమి రాజేష్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి అనంతరం వికలాంగులకు వృద్ధులకు భోజనాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెళ్లిరోజు పుట్టినరోజులను దివ్యాంగుల ఆశ్రమాలలో జరుపుకోవడం వలన ఉండే ఆనందం మరి ఎక్కడ దొరకదన్నారు ఈ కార్యక్రమంలో భారతి దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు కాగిత భాస్కరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర - అనపర్తి : గోదావరి డెల్టా భారతదేశంలో ధాన్యాగారంగా ఉన్న పరిస్థితుల్లో గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి చొరవతో టెంపరరీ రిలీఫ్ కోసం నిధులు కేటాయించినట్లు మంత్రి తెలపడం ఆనందకర విషయమన్నారు. ముఖ్యంగా ఆక్వా కల్చర్ ఇబ్బంది పడే పరిస్థితి నెలకొందని రోడ్లపైకి నీరు చేరి రోడ్లు పాడయ్యే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ నేపథ్యంలో గోదావరి డెల్టాని ఆధునికరించవలసిన అవసరం ఉందని సభా పూర్వకంగా మంత్రికి తెలిపారు. నదులు అనుసంధానం చేసి దేశంలో ఏపీని నీటిపారుదల రంగంలో ఒక నమూనాగా తయారు చేయాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్న నేపథ్యంలో గోదావరి డెల్టాని ఆధునికరిం చవలసిన అవసరం ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి సభలో పేర్కొన్నారు.

కనకరాజుపై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్లు ధర్నా

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని కాట్రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. పిహెచ్‌సి పరిధిలోని కాండ్రేగుల గ్రామ ఆశావర్కర్ల పై హెల్త్ సుపర్ వైజర్ కనకరాజు అసభ్యకరంగా వ్యవహారం చడంతో అతనిపై గతంలో ఆసుపత్రి వైద్యునికి ఫిర్యాదు చేశారు. ఆయన పట్టించుకోకపోవడంతో ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేశారు. జిల్లా కార్యాలయం నుంచి గత 10 రోజుల క్రితం అధికారులు వచ్చి ఆసుపత్రిలో విచారణ చేశారు. విచారణ చేసినా అతనిపై చర్యలు తీసుకోక పోవడంపై ఆశ వర్కర్స్ ఆందోళన బాటపట్టారు. ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి బేబీ రాణి ఆధ్వర్యంలో పిహెచ్‌సి ఎదుట ధర్నా నిర్వహించి కనకరాజును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బేబీ రాణి మాట్లాడు తూ పీహెచ్‌సిలో పని చేస్తున్న ఆశ వర్కర్లు మహిళలని చూడకుండా దుర్భాషలాడడం చాలా దారుణమైన చర్య అన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు విన్నవించగా కనక రాజుతో కుమ్మక్కైన వైద్యుడు శివ బాబు అతన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆ ఇద్దరినీ పిహెచ్‌సి పరిధిలోనే ట్రాన్స్ఫర్ చేశారు. సస్పెండ్ చేయలేదని వెంటనే సస్పెండ్ చేయా లని డిమాండ్ చేశారు. అదే విధంగా మహి ళల పట్ల అసభ్య కరంగా ప్రవర్తించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందో ళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమల్ల పద్మ, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

విలీన సభనుజయప్రదం చేయండి

విశాలాంధ్ర - రాజానగరం : 8న ఒంగోలు నగరంలో జరగనున్న ప్రగతిశీల మహిళా సంఘం(పివోడబ్ల్యు) విలీన సభను ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని పివోడబ్ల్యు జిల్లా కార్యదర్శి బచ్చల శ్రీదేవి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన రాజానగరం నందు పివోడబ్లు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ఇందుకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2013లో రెండుగా చీలిపోయిన పివోడబ్ల్యు తిరిగి ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక్కటిగా కలవనున్నాయన్నారు. విలీన సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. మద్యపానాన్ని నిషేధించడంలో నేటి ప్రభుత్వాలు విఫలం చెందాయనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ సమానత్వానికై మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై పివోడబ్ల్యు నిరంతర పోరాటాలు చేస్తుందని గుర్తుచేశారు. అనంతరం స్థానిక మహిళా నాయకులతో కలిసి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పివోడబ్ల్యు డివిజన్ నాయకురాలు మరికుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, తుమ్మల కళావతి, గౌరస దుర్గ, దొమ్మ సీత, నక్క లక్ష్మి, తోటకూర బేబీ, జి.అరవాలమ్మ, లొల్ల శివ పార్వతి, బలకుర్తి జగదంబ పాల్గొన్నారు.

నారీ ఫెస్ట్ పోటీలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - రాజానగరం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ వర్సిటీ నందు ఈ నెల 4 నుండి జరగనున్న నారీ ఫెస్ట్ పోటీలకు సర్వం సిద్ధం చేశామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్న శ్రీ అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 4 నుంచి జరగనున్న నారీ ఫెస్ట్ పోటీలకు సంబందించి పత్రిక ప్రకటనను సోమవారం విడుదల చేశారు.దీనిలో భాగంగా విసి ప్రసన్న శ్రీ మాట్లాడుతూ రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలోన్ని మహిళలకు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరుకు మహిళలకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు రోజులు జరగనున్న పోటీల్లో మహిళలందరూ ఉత్సాహంగా పల్గొనాలని పిలుపునిచ్చారు. 4న మామ్మ మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు, 5న వర్సిటీ, అనుబంధ కళాశాలల సిబ్బందికి పోటీలు, 6న నారీ ఫెస్ట్ వేడుకల్లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. హెల్దీ బేబీ పోటీలకు 91 6305789433, మామ్మ మనవరాలు పోటీలకు 91 99126 62500 పూర్తి సమాచారంకు పైనంబర్లను సంప్రదించాలని కోరారు. ఆసక్తి ఉన్న మహిళలు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ ధర రూ.150 గా నిర్ణయించినట్లు తెలిపారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్

విశాలాంధ్ర - జగ్గంపేట : పేదవాడి ఆకలి తీర్చేందుకే టీడీపీ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌కు గోకవరం గుబ్బలమ్మ గుడి కమిటీ చైర్మన్ ఆచంట రాజబాబు కుమారుడు ఆచంట బాబి సహాయాన్ని అందించారు. ఆయనతో కలిసి వెంకటేశ్వరరావు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో దేగల సత్తిబాబు, గోకాడ వెంకటేశ్వరరావు, గోకాడ వెంకటలక్ష్మి, తుమ్మ గంటి వీరబాబు, చిక్కాల సుగుణ, చిక్కాల శ్రీను, చిక్కాల లక్ష్మణ్, కోడూరి రమేష్, గారపాటి సత్తిబాబు, ఎండి కాజా తదితరులు పాల్గొన్నారు.

అక్షర విద్యార్థికి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక అక్షర కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న డి శ్యామెల్ రాజు అనే విద్యార్థి గోల్డ్ మెడల్ సాధిం చాడు. పవర్ జిమ్ గాజువాక వారు నిర్వహించిన రాష్ట్ర 4వ లిఫ్ట్ చాంపియన్ షిప్, రాష్ట్ర 7వ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీలలో అక్షర విద్యార్థి పాల్గొని గెలుపొందాడు. అతన్ని అక్షర విద్యా సంస్థల చైర్మన్ పాఠంశెట్టి సతీష్, కరస్పాండెంట్ ఆళ్ళ రవి కిషోర్, ఆళ్ళ శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ అధ్యాపకులు అభినందించారు.

పారిశుధ్య పనులు చేయించాలి : బాలామణి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం నీలాద్రి రావుపేట గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద డిఎల్‌పిఓ బాలామణి పంచాయతీ కార్యదర్శులు అందరితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య సిబ్బందితో దగ్గరుండి శానిటేషన్ పనులు చేయించాలని, చెత్త సేకరణ చేపట్టి తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో ఇంటి పన్నులు వసూలు చేసి, ఆ వచ్చిన సొమ్మును గ్రామాభివృద్ధికి ఉపయోగిం చాలన్నారు. ఇంటి పన్నుల వసూలు విషయంలో అలసత్వం చూపిన వారికి మెమో ఇష్యూ చేయడం జరుగుతుందని బాలామణి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్ళజోళ్లు పంపిణీ

విశాలాంధ్ర - సామర్లకోట : విద్యార్థుల సంరక్షణ పోషణ ద్వారా విద్యాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలలో పాఠశాల విద్యార్థులకు కంటి చూపు పరీక్షల నిర్వహణ ఒకటి. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా మండలంలోని అన్ని పాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. గుర్తించి అవసరాన్ని బట్టి మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సామర్లకోటలో మండల విద్యాశాఖ అధికారి వై శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం 45 మంది విద్యార్థులకు కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు తల్లితండ్రులు, ప్రధానోపాధ్యాయురాలు మీనా మాధురి, విద్యా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

పన్నుల వసూళ్లపై సమీక్ష

విశాలాంధ్ర - కరప : మండలంలోని గ్రామపంచాయతీకి ఆదాయ వనరులుగా ఉన్న ఇంటి పన్నులు, పన్నేతర వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించమని మండల పంచాయతీ విస్తరణ అధికారి సలాది వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇంటి పన్నులు 100% వసూలు చేసే విధంగా కార్యదర్శిలు కృషి చేయాలన్నారు. పన్నేతర వసూళ్లు త్వరగా వసూలు చేయాలన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలకు చెత్తను తరలించి కంపోస్ట్ తయారీ, డ్రైనేజీలు పూడికతీతలు, వీధులు పరిశుభ్రత, డ్రింకింగ్ వాటర్ పనితీరు మొదలగు అంశాలపై పై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయుట జరుగుతూ ఉంటుందని కార్యదర్శులు ఎప్పటికప్పుడు తమ యొక్క పనితీరును మెరుగుపరుచుకుని అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-దేవరపల్లి:అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం దేవరపల్లిలో భాష్యం స్కూల్‌లో విద్యార్థినీలకు 'లింగ సమానత్వమును ప్రోత్సహించడంలో పురుషుల యొక్క ఆవశ్యకత, పితృస్వామ్య వ్యవస్థలో ఎదురయ్యే సవాళ్లు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు, ఈ కార్యక్రమంలో దేవరపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అయినా శ్రీ వి సుబ్రహ్మణ్యం, స్కూల్ యాజమాన్యం, దేవరపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ కె నాగభూషణం, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ విజయశ్రీ ప్రిన్సిపల్ ప్యారే నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రత్యేక కృషి చేస్తానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పేర్కొన్నారు. దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సీలో వివిధ వార్డులను పరిశీలించి మౌలిక సదుపాయాలపై డాక్టర్ డి సాంబశివరావుని అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పాత భవనాలు మరమతులకు కొత్త భవనాలు నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుం దన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటు న్నారన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్న అందుబాటులో ఉన్న సిఎస్ఆర్ నిధులు, దాతల ద్వారా విరాళాలు సేకరించి రోగుల సౌకర్యార్థం నూతన బ్లాకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆండ్రు అనిల్, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రామారావు పాల్గొన్నారు.

పీఎస్ శర్మకు కలెక్టర్ అభినందన

విశాలాంధ్ర - అమలాపురం : 56 దేశాల సభ్యత్వం కలిగిన కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్‌లో క్షయ వ్యాధి నివారణకు 12 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన ఉప సంఘంలో భారతదేశం నుంచి ముగ్గురు డాక్టర్లను ఎంపిక చేయడం జరిగిందని వారి ముగ్గురిలో జిల్లా నుంచి డాక్టర్ పిఎస్ శర్మ సభ్యులుగా ఉండడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ నందు క్షయ వ్యాధి అపోహ నిర్మూలన గురించి ముద్రించిన ముద్రికను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలన ఉప సంఘంలో మన రాష్ట్రానికి చెందిన అమలాపురం వాస్త వ్యులైన డాక్టర్ పిఎస్ శర్మకు అవకాశం లభించడం హర్ష నీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ డాక్టర్ శర్మకు అభినందనలు తెలుపుతూ క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్యత అని ప్రతి పౌరుడు క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలని తెలిపారు. 17న జిల్లా కలెక్టర్ వారి కార్యాలయ ప్రాంగణంలో సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా కలెక్టర్ వారి అధ్యక్షతన క్షయ వ్యాధి నిర్మూలన గురించి అవ గాహన కార్యక్రమం ప్రజలతో ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ పిఎస్ శర్మ తెలిపారు. ప్రతి ఒక్కరూ యొక్క అవగాహన సదస్సుకు హాజరై క్షయ వ్యాధి పట్ల ప్రజలకు ఉన్న అపోహలను సందేహాలను నివృత్తి చేసుకునేందుకు చక్కటి వేదికన్నారు.

శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో శివానందలహరి పారాయణ తాడేపల్లిగూడెం చెందిన దేవరపల్లి జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో సోమవారం శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు విఘ్నేశ్వరుడు మహాలక్ష్మి సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం చెందిన రాధా కుమారి శివానందలహరి పారాయణ 100 శ్లోకాలలో 60 శ్లోకాలు నేర్పించారు ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం మహిళా కమిటీ సభ్యులు గతంలో సౌందర్య హరి 100 శ్లోకాలు నేర్చుకొని శృంగేరిలో పారాయణం చేశారు. అనంతరం శివానందలహరి పారాయణం నేర్చుకుంటున్నారు. ఇప్పటివరకు 60 శ్లోకాలు నేర్చుకున్నారు. మొత్తం 100 శ్లోకాలు పూర్తి అయిన తర్వాత పంచభూత లింగ క్షేత్రాలలో శివానందలహరి పారాయణ చేస్తారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువు రాధాకుమారి మాట్లాడుతూ శివానందలహరి నేర్పటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా విష్ణు సహస్రనామ ఫెడరేషన్ డైరెక్టర్ బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ శివానందలహరి విశిష్టతను తెలిపారు. ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం కమిటీ ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ మాట్లాడుతూ శివానందలహరి పారాయణం చేసిన తర్వాత పారాయణ సభ్యుల చే పంచభూత లింగ క్షేత్రాలలో శివానందలహరి పారాయణ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం కమిటీ చైర్మన్ చలంచర్ల, వీర వెంకట హరినాథ్, ఉపాధ్యక్షుడు నారాయణ విశ్వేశ్వరరావు. ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ. సహాయ కార్యదర్శి చెరవూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెపు లక్ష్మి మృతికి నేతల నివాళి

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పాలెపు లక్ష్మి (70) అనారోగ్య కారణంగా సోమవారం ఉదయం కన్నుమూశారు. పల్లం గ్రామానికి చెందిన లక్ష్మీకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆమె భర్త పాలెపు ధర్మారావు వైసీపీ నాయకులుగా ఉన్నారు. లక్ష్మీ పల్లం సర్పంచ్‌గా సేవలు అందించారు. మధ్యాహ్నం కాట్రేనికోన స్వగృహం నుంచి గౌతమీ గోదావరి తీరం కుండలేశ్వరంకు లక్ష్మీ పార్థివ దేహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి సంస్కారాలు పూర్తి చేశారు. పలువురు ప్రముఖులు, నాయకులు లక్ష్మీ పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ధర్మారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, రాష్ట్ర వైసీపీ నాయకులు పితాని బాలకృష్ణ, జడ్పిటిసి సభ్యులు నేల కిషోర్, టీటీడీ ఛానల్ మాజీ అడ్వైజర్ అడపా నాగ దుర్గారావు, నాయకులు ఏడిద చక్రపాణిరావు, ఏడిద సుబ్బారావు, సంసాని నాగేశ్వర రావు, సర్పంచులు గంటి వెంకట సుధాకర్, చొల్లంగి వెంకటేశ్వరరావు, నల్ల నరసింహమూర్తి, మల్లాడి నారా యణరావు, సంగాని పోతురాజు, పెయిల చిట్టిబాబు, ఏడిద లక్ష్మణరావు, పట్టా బాబ్జీ, కాసు బాబు, జగడం బాలయోగి తదితరులు సంతాపం తెలిపారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి ఉమా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ముగింపు సందర్భంగా సోమవారం భారీ స్థాయిలో అన్న సమారాధన నిర్వహించారు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వ హించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోదావరి రాం బాబు శర్మ అర్చకులు గోదావరి కార్తీక్ శర్మ ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో భారీ స్థాయిలో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, మహిళలు, దుద్దుకూరు, బంధపురం, రామన్నపాలెం, కొత్తగూడెం, పల్లంట్ల కురుకూరు, లక్ష్మీపురం ,ధూమంతుని గూడెం, కృష్ణం పాలెం, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు స్వామివారి వసంత మండపంలో కల్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహిం చారు. చందన సరూపుడైన వెంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈ ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రాజమండ్రి వాస్తవ్యులు ఇమండి ప్రదీప్ సూర్యకుమారి మరియు వారి కుటుంబ సభ్యులు రూ.1,00,000 లు అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు వర్మ తదితరులు స్వామివారి చిత్రపటం, తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

ట్రాఫిక్ రూరల్స్‌పై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ SDPO, ASP దేవరాజ్ మనిష్ పాటిల్ పర్యవేక్షణలో, కాకినాడ ట్రాఫిక్-1 సిఐ రమేష్, ట్రాఫిక్ -1, ఆర్ఎస్ఐ సురేష్, కాకినాడ జగన్నాధపురం దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థిని, విద్యార్థులకు, కొత్త ట్రాఫిక్ జరిమానాలు పైన, ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్ పైన, సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లు మోటార్ సైకిల్స్ డ్రైవ్ చేయుట వలన జరుగు ప్రమాదములు, పరిణామములు గురించి వివరించారు. మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని. వాహనములను అతి వేగముగా నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలుగు ప్రమాదాలు గురించి వివరించారు. అలాగే ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్స్, డిజిటల్ అరెస్టు 112/100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నిష్పక్షపాతంగా పని చేయండి

విశాలాంధ్ర - విజయవాడ క్రైం: విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమ శిక్షణ, నిజాయితీ, పారదర్శకత జవాబుదారీతనం పాటిస్తూ పని చేయాలని విజయవాడ పోలీస్ కమి షనర్ ఎస్వీ.రాజశేఖరబాబు ప్రొబేషనరీ ఎస్ఐలకు సూచించారు. పోలీస్ శిక్షణ పూర్తి చేసుకున్న 56 మందిని ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించారు. సోమ వారం నూతన ప్రొబేషనరీ ఎస్ఐలు సీపీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజశేఖర బాబు మాట్లాడుతూ పోలీస్‌శాఖలో అడుగుపెడు తున్న ప్రొబేషనరీ ఎస్ఐలకు అభినం దనలు తెలియజేశారు. బాధితులకు న్యాయం, ముద్దాయి లకు శిక్షలు కల్పించేలా పని చేయాలని సూచిం చారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని అన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను అప్లోడ్ చేసే విధానం, ఎఫ్ఐఆర్, దర్యాప్తుకు సంబంధించిన రికార్డులను రాయడం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. కేసులను ఏవిధంగా ఛేదించాలని, సీసీటీఎన్ఎస్, డ్రోన్స్‌ను ఉపయోగించడం, క్లౌడ్ పెట్రోలింగ్, సీసీ కెమెరా లను ఉపయోగం, అస్త్రం యాప్, ఈ పహారా బీట్, ఎన్‌డీపీఎస్ కేసుల్లో చేయాల్సిన విధులు, కేసు డైరీ రాయడం, నేర స్థలాన్ని పరిశోధనా, బందోబస్తు, పోలీస్ స్టేషన్ నిర్వహణ, వివిధ క్రైమ్ రికార్డ్‌లను మొదలగు అంశాలపై నేర్చుకోవాలన్నారు. అనుమా నం వచ్చినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లా ల న్నారు. ఈకార్యక్ర మంలో డీసీపీ గౌతమిషాలి, తిరుమలేశ్వరరెడ్డి, కేజీవి.సరిత, ఏబీటీఎస్ ఉదయ రాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్‌వీడీ. ప్రసాద్, ఏడీసీపీ గుణ్ణం రామ కృష్ణ, ఏఆర్.ఏసీపీ డి.ప్రసాద రావు, నూతన ప్రొబేషనరీ ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రీతికి న్యాయం జరగాలి

విశాలాంధ్ర - విజయవాడ : 2017లో అధికారంలో ఉన్న టిడిపి హయాంలో గిరి జన బాలిక సుగాలి ప్రీతి అత్యంత కిరాతకంగా, దారు ణంగా హత్యకు గురయితే ఇప్పటి వరకు ఆ కుటుం బానికి న్యాయం దక్కకపోవడం బాధాకరం అని జైభీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు,హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ అవేదన వ్యక్తం చేశారు. సోమ వారం గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో న్యూ హోప్ ఫౌండేషన్ వారు సుగాలి ప్రీతిపై రూపొందిం చిన ఒక పాట పోస్టర్ ను జడ శ్రావణ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లా డుతూ 2017 ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ సుగాలి ప్రీతి హత్య పై కొన్ని వందల సార్లు మాట్లాడారని,ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ఎన్నో మాట్లాడారని దుయ్యబట్టారు. 2017లో హత్యకు గురైతే 2020లో వైసిపి ప్రభుత్వం సీబిఐ విచారణకు ఆదేశించిందన్నారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా విచారణ ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కొన్ని వందల సార్లు సుగాలి ప్రీతి హత్యపై మాట్లాడిన పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చాక ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. జగన్ ప్రభుత్వం సుగాలి కుటుంబానికి ఉద్యోగం,5 ఎకరాలు పొలం ఇచ్చిందని తాను సుగాలి ప్రీతి కుటుం బం కోసం పోరాడా అన్నారు. న్యూ హోప్ ఫౌండేషన్ రచించిన పాటతో ప్రతి ఒక్కరూ కదిలిరావా లని,ప్రీతి కుటుంబానికి న్యాయం జరగాలని కోరారు.న్యూ హోప్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ మంచా నాగమల్లేశ్వరి, గాయకుడు రేజెండ్ల రాజేష్, సినీ మ్యూజిక్ డైరెక్టర్ నందన్ రాజు బొబ్బిలి మాట్లాడుతూ ఈనెల 8న మహిళా దినోత్సవం రోజున పాటను విడుదల చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో మహిళలు, యువతులపై జరుగుతున్న అకృత్యాలు, అఘాయిత్యాలు కలచి వేస్తున్నాయని అలాంటి ఆవేదనలో పుట్టుకొచ్చింది సుగాలి ప్రీతి పాట అన్నారు.ఆ కుటుం బానికి న్యాయం జరిగే వరకూ ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో జైభీమ్ రావు భారత్ పార్టీ ప్రధాన కార్యదర్శి పరసా సురేష్ పాల్గొన్నారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

కార్పొరేట్ ఆఫీస్ : 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, తమిళనాడు, ఇండియా. www.hindujahousingfinanace.com

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధనలు 9(5), మరియు 9(1) కింద రుణగ్రహీతకు స్థిర ఆస్తి అమ్మకపు నోటీసు

టు, **తేదీ: 03-03-2025**

1.శ్రీ ఆకుల రాజుబాబు తండ్రి ఎ.పోలారావు (రుణగ్రహీత) 2. శ్రీమతి ఆకుల స్వరూప, భర్త శ్రీ రాజుబాబు (సహ-రుణగ్రహీత), ఆర్/ఓ. డి.నం.2-119, ఇబిసి కాలనీ, గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా , ఆంధ్రప్రదేశ్ -534313.

విషయం: సర్ఫేశీ చట్టం, 2002 కింద హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ ద్వారా హామీగా పెట్టిన ఆస్తి విక్రయం

రిఫరెన్స్: రుణ ఖాతా నం. AP/RAJ/THRD/A000000059

డియర్ మేడమ్(లు)/ సర్(లు),

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట సెక్యూరిటైజేషన్ చట్టం చదివేది) కింద రూపొందించబడిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల యొక్క రూల్ 2(ఎ) ప్రకారం 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై - 600 015, తమిళనాడు, ఇండియా వద్ద కార్పొరేట్ కార్యాలయం మరియు 54-20-10/1ఎ, ఫ్లాట్ నెం: 43, 3వ అంతస్తు, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా, మెయిన్ రోడ్, గురునానక్ కాలనీ, విజయవాడ, పిన్- 520 008 నందు బ్రాంచ్ కార్యాలయం కలిగియున్న ఎం/ఎస్. హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై సెక్యూర్డ్ క్రెడిటార్‌గా పేర్కొనేది) అధీకృత అధికారిగా నేను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు,2002 యొక్క నియమాలు 8(5) మరియు 9(1) ప్రకారం మీకు ఈ నోటీసును జారీ చేడమైనది. అదే క్రింది విధంగా ఉంది:- 1.సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేశీ చట్టం) మరియు దాని కింద రూపొందించబడిన నిబంధనల కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి మీకు పంపిన నోటీసులో ప్రస్తావించిన విధంగా స్థిర ఆస్తి(హామీగాపెట్టిన ఆస్తి)కి సంబంధించి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేశీ చట్టం) మరియు దాని కింద పొందుపరచిన నిబంధనల కింద సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు సంక్రమించిన అధికారాలను వినియోగించి **హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్) ద్వారా తేదీ: 15-11-2022న రోజువారీ వార్తాపత్రికలు అంటే 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ & ప్రజాశక్తి'లో** ప్రచురించబడిన... **09-11-2022** న జారీ చేసిన స్వాధీనత నోటీసును మరియు హామీగా పెట్టిన ఆస్తి వద్ద స్పష్టమైన ప్రదేశంలో అతికించిన నోటీసు ను దయచేసి చదువగలరు.

2. ఈ రోజు వరకు, మీరు మీ బకాయిలను పూర్తిగా హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ కి చెల్లింపు చేయనందున సర్ఫేశీ చట్టం మరియు దానికింద రూపొందించిన నిబంధనల ప్రకారం హామీగా పెట్టిన ఆస్తిలో దిగువ పేర్కొన్న భాగాన్ని విక్రయించాలని హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ ప్రతిపాదిస్తోంది. హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ హామీగాపెట్టిన ఆస్తిని బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని భావిస్తోంది. హామీగా పెట్టిన ఆస్తి అత్యధిక బిడ్/ కొనుగోలు ధరను అందించే ఉద్దేశిత కొనుగోలుదారులలో ఒకరికి విక్రయించబడుతుంది. ఇది నిర్ణయించిన రిజర్వ్ ధర **రూ.23,00,000/- (ఇరవైమూడు లక్షల రూపాయలు మాత్రమే)** కంటే తక్కువగా ఉండదు.

సీలువేసినబిడ్/ఆఫర్‌ను సమర్పించడానికి చివరి తేదీ: **21-03-2025** మరియు **వేలం తేదీ: 22-03-2025.** వేలం నోటీసు కూడా తేదీ:**04-03-2025**న రెండు రోజువారీ వార్తాపత్రికలలో అంటే వరుసగా 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' మరియు 'విశాలాంధ్ర'లో ప్రచురించబడింది. 3. మీరు పొందిన రుణానికి సంబంధించి రుణ ఒప్పందం మరియు ఇతర పత్రాలలో పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం **28-02-2025 నాటికి రూ.26,53,781/-(ఇరవైఆరు లక్షల యాభైమూడు వేల ఏడు వందల ఎనభై ఒక్క రూపాయలు మాత్రమే)** లను తదుపరి వడ్డీ పీనల్ వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలతో కలిపి ఈ నోటీసు వచ్చిన 15 రోజులలోపు చెల్లించడంలో విఫలమయినట్లయితే ఈ క్రింద పేర్కొన్న హామీగా పెట్టిన ఆస్తి వేలం/ప్రైవేట్ ఒప్పందంలో విక్రయించబడుతుందని మేము మీకు నోటీసు ఇవ్వడమైనది. ఇంతకుముందు కూడా వేలం నిర్వహించబడినప్పటికీ రిజర్వ్ ధరకు సమానమైన బిడ్ రాలేదు. నిర్ణీత గడువులోగా మీరు మొత్తం బకాయిలను చెల్లించనట్లయితే మీకు తదుపరి ఎలాంటి నోటీసు ఇవ్వబడదు మరియు దిగువ పేర్కొన్న హామీగాపెట్టిన ఆస్తి ప్రైవేట్ ఒప్పందం ద్వారా విక్రయించబడుతుంది. హామీగాపెట్టిన ఆస్తి విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని సర్దుబాటు చేసిన తర్వాత హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ కి మీరు చెల్లించాల్సిన రుణం మొత్తంలో ఏదైనా మిగిలి ఉంటే... అది మీ నుండి వసూలు చేయబడుతుందని గమనించగలరు.

స్థిర ఆస్తి యొక్క వివరాలు (హామీగా పెట్టిన ఆస్తి) :

తూర్పుగోదావరిజిల్లా, తుని సబ్-రిజిస్ట్రీ, తొండంగి మండలం, సృగవరాక్షం గ్రామ పంచాయతీ మరియు గ్రామం, ఎస్.నం.161/2లో, దగ్గరి డోర్ నం.5-270, ఆర్.సి.సి. భవనంతో పాటు 387.2 చదరపు గజాల ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: బొబ్బిలి దొర స్థలం-56-0 అ॥లు, పడమర: 20లింకుల వెడల్పు దారి-56-0 అ॥లు, ఉత్తరం: పప్పాల వరహాల బాబు 62-2 అ॥లు, దక్షిణం: అరుమిల్లి జగదీశ్ మరియు ఇతరుల స్థలం-62-2 అ॥లు. పైన సరిహద్దుల పరిధిలో అన్ని సాధారణ మరియు అనుభవ హక్కులతో ఆర్‌సిసి భవనంతో 387.2 చదరపు గజాలు లేదా 325.24 చదరపు మీటర్ల విస్తీర్ణపు ఖాళీ స్థలం.

మీ విశ్వాసపాత్రుడు,(అధీకృత అధికారి)
హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

విశాలాంధ్ర - జగ్గంపేట : 16వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం మండలంలోని రామవరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి ఆసుపత్రికి తర లించగా మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన రౌతుల హర్షవర్ధన్ (17), వేణుం మణికంఠ (17), షేక్ అబ్దుల్లా (17)లు బూరుగుపూడి నుంచి ఒకే బండిపై జగ్గంపేట వెళ్తుండగా రామవరం వద్దకు వచ్చేసరికి ట్రాలీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా వేసుం మణికంఠ స్థానిక సిహెచ్‌సిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఐతే ట్రాలీ నడుపుతున్న డ్రైవర్ పరారీలో ఉన్నాడని సిఐ తెలి పారు. మృతదేహాలను పెద్దాపురం పోస్టుమార్టం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలైన్‌కు భూముల పరిశీలన

విశాలాంధ్ర - వీరులపాడు : ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు ఏర్పాటు చేయుచున్న రైల్వేలైనుకు సంబంధించిన మండల పరిధిలోని భూముల పెగ్‌మార్క్‌ను సోమవారం నందిగామ రెవెన్యూ డివిజన్ అధికారి బాలకృష్ణ సోమ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దాపురం గ్రామా నికి చెందిన భూములను ఆర్డీ వో పరిశీలించారు . ఈ కార్య క్రమంలో వీరులపాడు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సంధ్య, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : పిఠాపురం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వాన్ని పురస్కరించుకుని ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ సిహెచ్ఎస్ కె దుర్గా దేవి కొత్తపల్లి మండలం వాకతిప్పహైస్కూల్ నందు బాల, బాలికలకు బాల్య వివాహాలు జరగడం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మత పెద్దలతో క్రొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కిశోరి బాలికలతో మొక్కలు నాటడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్స్ యువివి అనంతలక్ష్మి డి సుజాత, స్కూల్ ప్రధానోపాధ్యాయులు పులిమేరు కృపారావు, మతపెద్దలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రమౌళి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా పనిచేసిన వెంటపల్లి చంద్రమౌళి అకస్మిక మృతి చెందారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పిల్లలు చదువుల నిమిత్తం సహకరించాలని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్‌కి చేసిన విజ్ఞప్తి మేరకు స్వర్గీయ జియంసి బాలయోగి 23వ వర్ధంతి సందర్భంగా అమలాపురంలోని బాలయోగి ఘాట్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి వర్యులు భూపతిరాజు శ్రీనివాస వర్మ ద్వారా మౌళి భార్య వరలక్ష్మికి లక్ష రూపాయల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి), జక్కల ప్రసాద్ బాబు, మోర్త భైరవమూర్తి, బోయిడి వేణుగోపాల్, వెంటపల్లి ఉమామహేశ్వరి, కుమార్, వెంకటేశ్వరరావు, కట్టా త్రిమూర్తులు, నిమ్మకాయల మూర్తి, టేకుమూడి వీర వెంకట సత్యనారాయణ, సూరంపూడి కుమార్, కదలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం మహిళా విభాగం చైర్ పర్సన్ బి సుజాత పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వారిచే మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరిం చారు. 5న జరిగే ప్రారంభోత్సవ సభకు జిల్లా కలెక్టర్‌ని ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 5న ఉదయం 9 గంటల నుంచి స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్, కాకినాడ నందు జరిగే క్రీడా పోటీలలో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గుద్దటి రామ్మోహన్‌రావు, కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, కోశాధికారి వై పద్మ మీనాక్షి, సహాధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా విభాగపు ఉపాధ్యక్షురాలు వి జయలక్ష్మి, కన్వీనర్ దేవి, కాకినాడ టౌన్ అధ్యక్షులు అరదాడి సత్తిరాజు, కార్యదర్శి వై రామకృష్ణ, మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - అమలాపురం : ఉప్పలగుప్తం. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి విద్య నేర్పించాలని గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు సూచించారు. గోపవరం అంగన్‌వాడీ కేంద్రంలోని 33 మంది చిన్నారులకు సోమవారం స్థానిక సర్పంచ్ కుంచే బుల్లియ్య (బాబాయ్) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ తరపున పాదరక్షలు, సాక్స్‌లను చైర్మన్ రమణారావు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల విద్య, వైద్యం కోసం రమణారావు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు, గ్రామ పెద్దలు అయితాబత్తుల వెంకట కృష్ణారావు, ఒగూరి విజయ్ కుమార్, కుంచే బాబులు, పందిరి సుబ్బరాజు, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, మధుర వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్లు గోసంగి బేబీ కుమారి, కుంచే దుర్గా భవాని, సిబ్బంది భారతీదేవి, సాయి దుర్గ, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సూరీడు భగభగలు...

- ఖాళీగా దర్శనమిస్తున్న రోడ్లు
- జాగ్రత్తగా ఉండాలంటూ ఏపీఎస్డిఎంఏ హెచ్చరికలు
- 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

విశాలాంధ్ర : కొవ్వూరు : వేసవి పూర్తిగా రాకుండానే సూర్య భగవానుడు తన ఉగ్రరూపంతో ప్రజలు బెంబేలెత్తున్నారు. ఎండలు భగభగ మండుతుండంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఒకవైపు మార్చి మొదటి వారంలోనే 38 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటుందోదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఒకవైపు ఎండతీవ్రత, మరోవైపు శీతల పానీయాలకు డిమాండ్ పెరగడంతో ప్రజలు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇరు తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాబోవు మూడు నెలల కాలం వడగాల్పులు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు బయటకు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో సుమారు 38 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

చార్‌ధామ్ పాదయాత్ర యువకుడికి సత్కారం

విశాలాంధ్ర - గండేపల్లి : గుజరాత్ నుంచి బయలుదేరిన 22 సంవత్సరాల ఓ యువకుడు ఆధ్యాత్మిక చింతనతో చార్‌ధామ్ పాదయాత్ర పేరిట జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు దాదాపు 16 వేల కిలోమీటర్లు కాలినడకన పాదయాత్ర చేసుకుంటూ సోమవారం జగ్గంపేట చేరుకున్నారు. జగ్గంపేట జాతీయ రహదారి మీదుగా వెళుతున్న ఆ యువకుడిని చూసిన భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పాలచర్ల నాగేంద్రచౌదరి అతన్ని స్థానిక రుచి హోటల్‌కి తీసుకువచ్చి శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. 22 సంవత్సరాల వయసులో పాదయాత్రగా దైవదర్శనాలు చేపడుతున్న ఆ యువకుడిని అభినందించారు. అనంతరం ఆ యువకుడికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం, నిద్రించేందుకు బస ఏర్పాటు చేశారు. ఈరోజు మొత్తం విశ్రాంతి తీసుకుని రేపు ఉదయం అల్పాహారం తీసుకుని ఇక్కడ నుండి బయలుదేరుతారు. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరికి ఆ యువకుడు కృతజ్ఞతలు తెలిపి పాదయాత్ర ముందుకి కొనసాగించారు.



ముగిసిన 'ఎఫ్‌పీజీయేతో డిజిటల్ హార్డ్వేర్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెం లోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ (బోధన, అభ్యాస కేంద్రం), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వ హించిన 'ఎఫ్‌పీజీయేతో డిజిటల్ హార్డ్వేర్ ఇంజనీరింగ్' అనే ఆన్లైన్ ప్రామాణికత కోర్సు విజయవంతంగా ముగిసింది. ఈ కోర్సులో ఎఫ్‌పీజీయే సాంకేతికత పరిచయం, డిజిటల్ డిజైన్ మూలసూత్రాలు, ఎఫ్‌పీజీయే ఆకృతిశిల్పన విధానం, వేరిలాగ్ ప్రోగ్రామింగ్, సంక్షిప్త తార్కిక రూపకల్పన, క్రమానుగత తార్కికం, అంతిమ స్థితి యంత్రాలు (ఎఫ్ఎస్ఎం), వేరిలాగ్‌లో అనుకరణ మరియు పరీక్షా వాతావరణం వంటి ముఖ్యమైన అంశాలపై లోతైన విశ్లేషణ చేశారు. ఆదిత్య విశ్వవిద్యాలయం అంతర్జాతీయ సంబంధాల సమన్వయకర్త, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, సహాయ ప్రాధ్యాపకులు డా మొహమ్మద్ తాజ్, ముఖ్య వక్తగా వ్యవహరించారు. ఈ కోర్సులో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. కోర్సు విజయవంతంగా పూర్తవడంలో విశ్వ విద్యాలయ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్స్) డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి సురేష్, కోఆర్డినేటర్ డా ఐ వీరాంజనేయులు కీలక పాత్ర పోషించారు.